'సుగుణా'

'.........'

'సుగుణా సుగుణా.'

'ఓసుగుణా ఎచ్చటినుంటివి సుగుణా.'

'ఆ ఇచ్చటనండి ఈదొడ్డివసారాలో'

'ఏమి చేయుచుంటివి ?

'పెరుగు చిలుకుచుంటిని. ఏమాఖంగారు'

'ఎన్నిసారులుపిల్చిన పలుకవేమి ?'

'నాకు వినిపించనిదే—ఈపెరుగు చిలుకు ధ్వనిమీద.'

'సరేకాని మాతల్లిగారి దగ్గరనుండి కమ్మ వచ్చినది.'

'ఆహా నిజమా ?'

'నిజముగాక కల్లా?'

'కులాసాయేనా! యిప్పుడు ఎచ్చట నున్నట్టు?'

'ఇప్పుడా! రామేశ్వరయాత్ర కానిచ్చుకొని మరల తిరుగుదలలో, కాళహస్తి పెదతిరుపతి మొదలైన యాత్రలు చూచుకొని ప్రస్తుతము మద్రాసులో నుండిరట. దగ్గరనున్న డబ్బు ఖర్చుఅయిపోయినదట. అరువదియో డెబ్బదియో పంపిన శ్రీశైలయాత్ర మొదలైనవికూడా చూచుకొని తిరిగి వత్తురట. శరీరములో మాత్రము స్వస్థతగనే యున్నదట.'

'మరి డబ్బుపంపరా ?'

'వెంకయ్యగారివద్ద తీసుకొని తిరుగుటపాలో మనియార్డరుచేయుమని "పోస్టుప్యూన్" వెంకటస్వామి చేతికి వందరూపాయీలు యిచ్చితిని.'

'వెంకటస్వామినమ్మకమైనవాడా యేమి?'

'నమ్మతగినవాడు కనుకనే వందరూపాయీలు యిచ్చితిని.'

'మీతల్లిగారు డెబ్బదిరూపాయీలు యడిగిన మీరు వందరూపాయీలు పంపినారా?'

'మొందులకైన అవసరము వచ్చునని తరువాత డబ్బులేకపోయిన ఆపర్వతములలో యెవరు యిచ్చెదరు. అప్పుడు మాతల్లిగారు బాధలపాలగుదురు. ఆమె బాధపడుట నాకు శ్రేయస్కరము గాదు. ఆమెకొరకై నా ప్రాణము విడువుమన్నను పరమ సంతోషముతో విడచెదను. గాని ఆమెను బాధల పాల్చేయ నామనసొప్పదు.'

'ఆహాహా ఏమి మాతృభక్తియండి. అంత ప్రేమ పర్వతమధ్యనుండి క్రిందికి వడిగా ప్రవహించు నిర్ఝరిణివలె ప్రవహించు చుండగా పుణ్యాత్ములరాలైన ఆమాతృదేవతకేమి కొరత.'

'నీకు మాతృదేవతయనిన హాస్యముగా నున్నది. వేదములుకూడా "మాతృదేవో

భవ పితృదేవోభవ" యని ఘోషించుచున్నవి. అందులో రెంటిలోనుకూడా మాతృదేవతకే ఎక్కువ ఆధిక్యతయున్నది. ఎందులకనిన నవమాసములుమోసి అష్టకష్టములుపడి నానాబాధలకు లోనయి కని, పెంచునది తల్లిగాని తండ్రిగాదు గదా! అటులని తండ్రిలో ఆధిక్యత తక్కువయని కాదు నాభావం. ఎక్కువ శ్రమకు లోనగునది తల్లి. అట్టి తల్లిని బాధలుపెట్టి తినునది పవిత్రమైన యన్నముగాదు. దుష్టులైనటువంటి రాక్షసులు భుజించు రుధిరాన్నము. ఏ రుధిరాన్నమైనను అసలు దొరకెనగదా! పరమపవిత్రులైనటువంటివన్ని, పూజార్హులైనటువంటివన్ని, వానివృద్ధికి కారణభూతులైనటువంటి మాతృదేవత బాధలననుభవించుచుండ ఆదుర్మార్గునికి అన్నము దొరకునా? అటువంటి దురాత్ముని కొరతవేసినను పాపముండునా? అటువంటి దౌష్ట్యుని నిలువున రెండుముక్కలుగా తరిగి ఉప్పుకారమంటించినను వాని పాపమునకు ప్రతిఫలమగునా? అటువంటి దుష్టబుద్ధిని చిత్రవధ—'

'ఆ—చాల్లెద్దురూ! కబుర్లుచెప్పారు. ఇటువంటి ఉపన్యాసములు ఇచ్చుటకేమి? కబుర్లు ఖరీదునకు కొనవలెనా? అవిలోతైన బావిలో ఉదకము పుట్టుచున్నట్లు ఊరుచునేయుందును. అవసరమైన వాక్యములు అతిగాఢముగా బాణములు ప్రయోగించురీతి ప్రయోగించవచ్చును. కాని వాచాచెప్పుటయే కాని క్రియనున్న. ఇటువంటి డంబములకేమి?'

'చాలులే ఊరకోనుము. నోటితో చెప్పుటయో చేతితో చేయుటయో నీకేమి తెలియును. నీవలన "ఒపీనియన్" పొందినగాని నాకు వేరొకగతిలేదా ఏమి? చాలులే! ఇదిగో గృహలక్ష్మివచ్చినది. తీసుకొనుము.'

అనుచు నవ్వుచు ఆయన వెడలిపోయినారు. నేను ఆమాసపత్రికను చూచుసరికి నాయొక్క సంతోషము "పెన్నిధిగన్న పేద చందంబునన్" బోలినది. దానిని గదిలోనికి తీసుకొనిపోయి పుస్తకములలో జాగ్రత్తపెట్టి తిరిగి వచ్చుచున్నంతలో ఆయన మరల తిరిగి వచ్చి "సుగుణా నేను నవ్యవాణికై వ్రాసిన వ్యాసము ప్రకటింపబడలేదు సుమా" అనినారు.

'ఏమండీ మీరువ్రాసిన వ్యాసముపేరేమి? మీరూపము, మీవచో జృంభణ, మీకవితా ధోరణి, మీతెలివితేట పుంజముల నిగనిగ కాంతులు ఆపత్రికాధిపతులకు తెలియవు గాబోలు.'

'నారూపమనినావు. నాసౌందర్యములో ఏమిలోటు—'

'ఏమియును లోటులేదు. అక్రాఫ్ యొక్క తేటతనము, అమావాస్యనాటి చీకటిని నిరసించు ఆశరీరకాంతి, సినిమాలోని మారీచుని వదనమును మించిన ఆమోమువాలకము, భావకవిగారు అనిపించుకొనవలెనని కాబోలు కట్టిన ఆకట్టు, పరకాంతాప్రియుడైనటువంటి కీచకుని వధించిన భీమునివలె నడువవలెనని నడచు ఆనడక, నేటివ్ ప్రిన్సునని—'

'ఏమిటా కవిత్వము? నీ కవిత్వధోరణికి తక్షణము ఆనకట్టు కట్టకపోయిన చుట్టుపట్ల

నున్న గ్రామములను ముంచునేమోయని 'భయము కలుగుచున్నది.'

నాకవిత్వధోరణికి ఆనకట్టను వేయుటకు తగినకూలీలు అకస్మాత్తుగా సప్లయికావలె నన్నారు. కాని మీకవిత్వములోనున్న సారస్యమేమో కొద్ది తెలియజేయుడు. మీరు వ్రాసిన వ్యాసముపేరు లొట్టాబట్టీయమా? కత్తిరాయీ సంవాదమా? తిరుమలతాతీయమా? మీభావకవిత్వమంతపాడుది మరియొకటిలేదని చాలమంది ఇంకొక నోరును బదులు తెచ్చుకొని కూడ దూషించుచున్నారు. ఒకమహనీయుడు "భావగీతమనీ జన్మపాడుగాను"అనిబహుపరుషముగాదీవించినాడు. భావకవులలోనున్న గొప్పదుర్బుద్ధియేమనగా విధాతకు నెనవచ్చు పూర్వకవుల గ్రంథములను వీరి అమేయమైన తెలివికి విమర్శించబోతారు. మనుచరిత్రకారకుడైనటువంటి అలసానిపెద్దనగారి బుజ్జముట్టిబుజ్జని, పెద్దనగారు అనేకంటె పెద్దన్నగారంటే చాలా మృదువుగా వుంటుంది శబ్దం అంటారు.'

'అనుమానంలేకుండా భారతభాగవత రామాయణాలను పారాయణచేసేవారిని చూస్తే అడ్డదిడ్డపు ప్రశ్నలు నాలుగువిసిరి అడుసులో అడుగువేయిస్తారు. వీరువేశే ప్రశ్నలు ఎల్లావుంటాయంటారా! మహావినయముగా ఉపక్రమిస్తారు. అయ్యా! శాస్త్రిగారూ! శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తి దగ్గరకుపోయి మూడడుగులుదానం ఈయమనినాడటే ఎందులకంటారు? అనిప్రశ్న.

ఇంద్రునిపదవి బలిచక్రవర్తి అధీనమైపోవునని ఇంద్రునికి గుండెదడబుట్టి నలువగారివద్ద వసుగుతూనసుగుతూ మనవిచేసుకొని బాహాటంగా పాదాలమీదబడి బ్రతిమాలుతే ఇంద్రునియొక్క పదవి రక్షించే ఉపాయము నాలుగుబుజ్జలున్నా ఆయనకు తోచక తండ్రిగారైనటువంటి విష్ణుమూర్తిగారికి తెలియజేస్తే కామరూపధరుడైనటువంటి, అనగా చేప, కూర్మము, వరాహము, సింహము మొదలైన రూపాలుమెత్తేటువంటి ఆయన వామనావతారుడై బలిచక్రవర్తిని మూడడుగులు భూమినడిగి, ఒకఅడుగు భూమి, రెండవ అడుగు ఆకాశము మూడవఅడుగు బలిచక్రవర్తి నెత్తిపైన పెట్టి పాతాళమునకు త్రొక్కివేశాడు. ఇదీకథ. అని చలాక్ అయినటువంటి శాస్త్రిగారి జవాబు.

శాస్త్రిగారూ! బాగానేవుందండి. మొదటి అడుగు భూమి అన్నారూ భూమంతావామనుని అధీనమైనట్టేగా రెండవఅడుగు ఆకాశం. మూడవఅడుగు బలిచక్రవర్తియొక్క శిరస్సుమీదనా? "పాత్రాధారంఘృతంవా ఘృతాధారం పాత్రంవా"అని భూమ్యాధారం బలిచక్రవర్తికా బలిచక్రవర్తి ఆధారం భూమికా? భూమంతా మొదటిపాదములో అయిపోగా బలిచక్రవర్తి శిరస్సుమీద మూడవపాదానికి స్థలమెక్కడుంది. పోనీ ఉందనుకోండి. భూమ్యాధారం బలిచక్రవర్తికి పోయినప్పుడు ఆయనశిరస్సు మీదున్నటువంటి స్థలము ఎందులకు పనికివచ్చును.

454

శాస్త్రిగారు బాగా ఆలోచించారు. ఆయనకు ఆప్రశ్నతోటి మతిపోయినట్లైంది. అట్టే ఆలోచించి. "అబ్బాయీ మహానుభావుడు ఆపోతనగారు సమర్థించాలి కాని మనబోటివాళ్ల చేతగాదు. పోతనగారి బావమర్ది శ్రీనాథుడుగారు గజేంద్రమోక్షములో వ్రాయబడిన "సిరికింజెప్పడు శంఖచక్రయుగముంజేదోయి సంధింపడు" అన్న పద్యాన్ని ఆక్షేపణచేసినప్పుడు పోతరాజుగారు ఏమని సమర్థించారు?—బావకు నోటితోటిచెబితే అనుభవసిద్ధంగా ఉండదని "ప్రాక్టికల్"గా చూపించారు. ఇప్పుడు మీరుకూడా పోతరాజుగార్కి ఉత్తరము వ్రాసో మనిషినిపంపో కనుక్కుంటే తెలిసిపోతుంది. మీరు భావకవులని నాకూ తెలుసు. మీరు ఎక్కువ ఇంగ్లీషువాడతారు. ఉత్తరము మాత్రము ఇంగ్లీషున వ్రాయక తెలుగున వ్రాయండి. ఆ పోతరాజుగారు ఏ విశ్వవిద్యాలయములోనూ చదువుకున్నట్టు కనుపించదు. చదువుకొన్నవాళ్లు ఆయనవుండేచోటవున్నా వాళ్లచేత చదివిస్తే ఉత్తరముబట్టి బయలవుతుంది అని గడుసుతనంగా జవాబిచ్చాడు. అంతేటండీ శాస్త్రిగారూ! మీరేదో సమర్థించి చెప్తారనుకొన్నాను. ఇంతేనా అంటూ బుటాయిగ్రాఫ్ వెనక్కి విసిరి మీసాలు లేకపోయినా మీసాలుదువ్వుతూ వెళ్లిపోయాడు భావకవి. ఇటులనేవుంటాయి మీ భావకవులు వేసేప్రశ్నలు. వీటి తెలివికి పోతన్నగారిబుద్ధి పెడతొక్కుతొక్కిందని, తిక్కన సోమయాజిగారి తెలివి తేగల తెలివని, భట్టుకవిగారి కవిత్వము బావురుమన్నట్టుండదని ఎంచడమే గాపని. "కుహూవీనీవనేమంటే సుహూపాలని యోచడమేనాపని" అన్నట్టుంటుంది మీభావకవుల భావం. ఇంకొక మహానుభావుడన్నాడు. భావకవులు బొచ్చుపెంచుటలో షోకుమజాచేస్తారు గాని ఇతర తెలివి తేటలు పూర్ణానుస్వారం అని. భావకవులు భోజనానికి సంపాదించలేకపోయినా భావాలకు లోటులేదు. ఆకవులకు పూర్తి ఇంగ్లీషూ రాదు. తెలుగు సమాప్తీ గాదు. సంస్కృతము సంపూర్ణమవదు. హిందీకూడా సశేషమే. ప్రతీవాడుకూడా అన్ని భాషల్లోను వేలెట్టి "టాగూర్ మహాకవి"లాగు అయిపోవాలని ఊహ. కాని వాళ్ల జాతకములో గురుడు వక్రిస్తే చదువెక్కడనుంచి వస్తుంది. ఉభయభాషా ప్రవీణ, అని బిరుదు సంపాదిద్దామనుకుంటారు. ఆపూహాతారుమారై ఉభయభాషాభ్రష్ట అనే బిరుదు వర్తిస్తుంది. ఒకభావకవిగారు ఒకరోజున ఊరంతాషికారుకొట్టివచ్చి గృహమునాడు సాయిమీదికి లేక పాయిలోకి లేక మతిపోయినట్టయి తన భాషాపాండిత్యమంతా ఉపయోగించి ఈ క్రింది శ్లోకమును రచించినారట.

శ్లో॥ తండులాలు గృహమందు నసన్తి
తిండికైతె పదిమంది వసన్తి
పాయిలోకిద్దైన లకంతి
దొంగవెధవలు హసన్తి.

అనినారట. ఆఖరు పాదమునకు ఆయన పూహా ఇంట్లో ఉన్నవాళ్లంతా నశిస్తారు

455

అని. ఆయింటోవాళ్ళల్లో తనుకూడా జమేనా కాదా? ఇక మామూలుగా మాట్లాడే భాష చూద్దాం. "ఐసాహెమెన్నేక్ పాము ఇన్ ది సంతబజార్ బట్ అయితే కొడుదునుగాని ఐ, హావ్, నో, స్టిక్, కఱ్ఱ, ఇన్, మై, చేతి, హాండ్," అని మొదట బాగానే ఇంగ్లీషు మాట్లాడతారు. మధ్యలో అకస్మాత్తుగా (do) డు అని వుపయోగించాలో "డిడ్" అనాలో "ఈజ్" అనో "వాజ్" అనో తెలియక పప్పులో అడుగేసి నవ్వులపాలై పరిహాసమునకు పాత్రుడవుతుంటాడు. ఇంకొక భావకవిగారు ఏక్, మేన్, వన్, బాల్చా, నిండా, తైలం, పూరయిత్వా, హెడ్ పై, నిధాయ, బజార్, మేం, తిరుగుచు, ఫిల్లా చిల్లాకర్, కహానేలగా, జోర్, అమ్ముట, కర్తాహై." అని ఆయనయొక్క త్రిభాషా పాండిత్యము వెలుగజేయుచూ వుంటాడు. కనుపించిన స్త్రీ నల్లా శృంగార రసములో శ్రీనాథుణ్ని దాసోహం అనిపించాలని తనివి తీరా వర్ణించేస్తాడు. ఆవర్ణన ఆస్త్రీకి వినిపించి నట్లైతే ఆపె వాళ్ళవాళ్ళతోటి చెబితే పాదరక్ష ప్రయోగం అవుతుందేమోనని భయం. హృదయంలోవుండి లోలోపలే వర్ణించుకొనీ ఆమె వెనుదిరిగి చూచినప్పుడు కన్నుగీటి ఒక విధమైన సంజ్ఞ చేస్తాడు. చిన్నతనంలో వీళ్ల తల్లులు కళ్లు చికిలించకుండా ఘాటైన కాటుక పెట్టినట్టు తోచదు. పెట్టినట్లైతే అంతఅకస్మాత్తుగా ఆకన్నుగీటుదొమ్మ వీళ్లని బాధించదు. ఇటీవల చాలామంది నేత్రవైద్యులు ఈకన్నుగీటుదొమ్మఅనేది జలజల వాతంచేతవస్తుందా, కంపమేహాముచేత సంభవిస్తుందా, ఎగురుడు పైత్యంచేత ప్రవేశిస్తుందా అని ఆయుర్వేద గ్రంథాలన్నీ గుమాస్తాలనుపెట్టి వెతికిస్తున్నారట. కొంతకాలంలో సాధించి తెలుసుకుంటారనికూడా, రూమర్, ప్రబలింది. ఆ నేత్రవైద్యులు పట్టుకొని సాధిస్తారని నాకూ ఉంది నమ్మకం. ఎంచేతంటే "కష్టేఫలీ" అన్నారు గదండి."

"ఏమిటీ సుగుణా ఈ లెక్చర్. చాలా ఆయాసపడినట్లున్నావు. కాశిని మంచితీర్థం తీసుకో. మా భావకవులంటే నీకంతఓర్వలేనితనమెందులకు?—

"ఆ, ఆ, ఆగండి మీభావకవులవిషయాలను గురించి అప్పుడే నేను మంగళవాక్యము చెప్పనిదే. ఇంకా వున్నవి విషయాలు. మీ భావకవులు విమర్శించిన విషయాలు యింకా కొన్ని చెప్తాను ఒకభావకవిగారు అన్నారు—పూర్వకవులకు చిన్న మెత్తైనా తెలివిలేదుట. నోటికివచ్చినట్టు వీళ్లు కవిత్వము చెబితే గంగిరెద్దుల్లాగ ఆ అంకితము పుచ్చుకొన్న మహారాజులు బుఱ్ఱూపి ఆనందించారట. ఇంక ప్రజలు "యథారాజా తథాప్రజా"ట, వాళ్లు వ్రాసినంత అప్రోచికపు కవిత్వము మరొకటి లేదుట. వాళ్లు వ్రాసిన పద్యం వీళ్లకి తెలియకపోతే అది అప్రాచికపు కవిత్వమే కాబోలు. అటులనుటకు కారణం పూర్వపు కవులు స్త్రీని వర్ణించుచూ ఎక్కడో వస్త్రాలలో అడగి

మణిగి వున్నటువంటి తొడలను అరటికంబములతోటి పోల్చారుగదా. వీళ్లకవియెల్లా కనుపించాయి. అటువంటిది అప్రాచికపు కవిత్వముగాదా! అని ప్రశ్నించారు భావకవిగారు. రెండవప్రశ్న ఏమిటంటే, రహస్యావయవాలనికూడా బాహాటంగా వర్ణించేశారే! అవర్ణనలు నీచంఅయినటువంటి బూతులలో చేరవా? అటువంటి బూతులు మహానీయులైనటువంటివారి నోటినుండి బయలువెడలవచ్చునా, అదిబూతుకవిత్వముగాదా?

నేను దానికి జబాబుచెబుతున్నాను చూడండి. మొదటిప్రశ్న, వస్త్రములలో అడగి మణగివున్నటువంటి తొడలు వీరికెల్లా గోచరించాయి అని, రవికానని చోటును కవి గనుగొనునను మాటమరచిరి కాబోలాభావకవిగారు.

రెండవది. రహస్యావయవాలని కూడా వర్ణించవచ్చునా? అదితప్పుకాదా? కవి చౌడప్పగారు పది నీతులు పదిబూతులు చెప్తేనేగాని గ్రంథం సారస్యంగా వుండదని నారు. ఆవ్యూహే పూర్వకవులకుకూడా అయి వుండవచ్చునని నావూహ. ఇటువంటివి భావకవులకు తెలిసియో తెలియకో చొప్పదంట కవిత్వాలని శోధనచేయబోతారు పెద్ద గ్రంథాలను గొప్పకవులను.

ఆనాడు రామమ్మగారూ మేమూ కలసి సినీమాకు వెడలినాము చూచారూ ఆరోజున వెళ్లుచుండగా దారిలో ఏదో కూను రాగము వినిపించింది. ఏమిటా అని చూద్దునుగదా సన్నంగా సమీపములోనే వినిపిస్తోంది. అప్పటికే అంధకారం అటునుంచి ఇటునుంచి వ్యాపిస్తోంది. ఎదరనున్నటువంటి మనిషిని గుర్తించకుండా చేయడానికి ప్రయత్నిస్తోంది. ఆ రాగ మాలాపనచేయువాడు తమాషాగా నడచుచూ క్రమక్రమముగా మమ్ములను సమీపిస్తున్నాడు. ఆ క్రాఫ్ మూరెడెత్తున ఎదిగివున్నది. ట్విల్లుషర్టు, మల్లెపూవులాంటి పంచె, పైమీదచిన్న టవల్, ధరించియున్నాడు. ఎడమచేతిలో చేతికఱ్ఱ ఊగుచున్నది. కుడిచేతిలో సిగరెట్ వెలుగుచున్నది. మధ్యమధ్య సిగరెట్ పీల్చుచూ కూనురాగము తీయుచూ మమ్ములను సమీపించినాడు. ఆపాటయేమా అని పరిశీలించి విందునుకదా "చెప్పుకుంటే చెడ్డ సిగ్గోలప్పమ్మ" అని వినిపించింది. ఈవాక్యము వినుసరికి నాకు నవ్వు హృదయము బ్రద్దలుచేసుక వచ్చినది. బలవంతముగా ఆ నవ్వును ఆపుకొని కళ్లు బాగుగా విప్పి పరీక్షగా చూచితిని. చదువురాని మూఢుడా యనిన వాలకం ఆ మాదిరి లేదే. మూతిని అష్టదిక్కులకూ త్రిప్పుచునూ ఆలాపన సాగిస్తూనే యున్నాడు. ఆ ఆలాపన హద్దులేని ప్రవాహం. కాని ప్రవాహఘోషవలెనే మధ్యమధ్య ఒకవిధమైన గురగురధ్వని కూడాను. అక్కడక్కడ కీచుగా పోతోంది.

మాబండివెనుక వచ్చుచునే యున్నాడు. క్రమక్రమముగా మా శకటము సినీమాహాలు సమీపించింది. అంతలో ఎవరో మా

వెనుకవచ్చు వ్యక్తిని "ఏమండోయి భావకవిగారూ!" అని పలుకరించినారు. భావకవి అనగానే నానోటనుండి "భావకవులు బొచ్చు పెంచుటలోను భావకవిత్వము చెప్పుటలోనూ గాక సంగీతములోకూడా షోకు చూపిస్తారే." అని అప్రయత్నముగా వచ్చివేసినది. ఆ వాక్యము ఆ భావకవిగారికి వినిపించియుండదు. ఆభావకవిగారు సిగిరెట్ కాల్చుటలో చూపినషోకు వర్ణించుటకు భాషలో అక్షరములు కానరావు.

తలిశెట్టి రామారావుగారు ఒక భారతి మాసపత్రికలో "బ్రహ్మగారికి కొన్నిసూచనలు" అనుపేరుతో నాలుగు చిత్రములను చిత్రించియున్నారు.

ఎద్దుబొమ్మవేసి బ్రాందీ ఎద్దు ఈయునట్లు పక్షిబొమ్మవేసి పక్షియే విమానమురీతి ఉపయోగించవలెననియు టీకప్పుతుప్ప అని తుప్పను చిత్రించి టీకప్పుతుప్ప మొక్కను సృజించిన బాగుండుననట్లు, సిగరెట్ల చెట్టు గీసి సిగరెట్లచెట్టును పుట్టించిన బాగుండుననియు కొన్నిసూచనలు తెల్పియున్నారు. ఈ నాలుగువిషయములు బ్రహ్మగారు కరుణించి సృజించినట్లైతే మనరొట్టె నేతిలోపడినట్టే అని ఒకభావకవిగారు ఒకానొక సమయములో తమయొక్క మనోభిప్రాయమును వెల్లడిచేసి యున్నారు. అటులచేసిన మంచిదే అని నా వూహకూడ. సరియైన విషయము గురించి వ్రాసినట్టయితే భావకవిత్వమైనా బాగానే వుంటుంది. కాని మనభావకవులకు ఫోర్సు ఎక్కువై గైరమ్మపాటల మీదను, గోంగోరపాటలమీదను, అప్పన్నకొండ పాటలమీదను ఎక్కువమోజు కనుపరచుచున్నారు. ఈమార్గమున గ్రామఫోను కంపెనీవారుకూడా ప్రయాణముచేసినారు. ఎందువల్లననగా గ్రామఫోను వచ్చిన క్రొత్తలో పెద్దవాళ్లు అనగా భక్తియందు అభిమానమున్నటువంటి ముసలివాళ్లు, గానమునం దభిమానమున్నటువంటి కళాభిమానులు, ఏమనుకున్నారంటే గొప్పగొప్ప పాటకులయొక్క భక్తిరసమైనటువంటి కీర్తనలు, గీతములు, శాశ్వతముగా వుండిపోవుమార్గమున్ను శ్రవణానందముగా విను ప్రాప్తిన్ని దొరకినదని సంతోషించినారు. కాని గ్రామఫోను కంపెనీదార్లయొక్క బుద్ధులు పెడతోక్కుతొక్కి భక్తిరసప్రధానమైనటువంటి కీర్తనలు విడచిపెట్టి గోంగోర పాటలమీదను కోడిపందెపు పాటలమీదను మోజు ఎక్కువ చూపించుచున్నారు. గ్రామఫోనులు దేశమునకు ఉపకారము చేస్తవి అని యనుకొనగా అపకారమే చేయుచున్నవి. ఆ రీతిగానే భావకవులయొక్క మనస్సుకూడా తప్పుడు కవిత్వములోనికి పోవుచున్నది. మహానీయులు మంగిపూడి వేంకటశర్మగారు కవులను సంబోధించి "లోకోపకృతికి జెందని యాకవనము వనమె యనెదు నానుడిగనుడీ" అని వాకొనినారు. నాయొక్క వూహకూడా అంతే."

"చాలు నీమాటలసందడిని నాపనులన్నియు మరచితిని."

ఇదిగో అయినది. నేను పెరుగుచిలుకుచు దానిమాటయే మరచితిని. నేను చిన్నసంగతిని చెప్పెదను వినుడు. పెరుగు చిలికినగాని వెన్న వచ్చునా? సువర్ణమును పుటమువేసి సుత్తెతో మర్దించినగాని మేలిమి బంగారమవునా? అటులనే పురాణములను, ప్రబంధములను తెరచి తెరచి లోలోననే శోధించి తెలుసుకొనవలెను గాని చిన్నసంగతినిబట్టి పెద్ద గ్రంథములను పరీక్షించుట కుక్కతోక బట్టుకొని గోదావరీదుటయే.

"అయినదా? మా భావకవుల విషయములను గురించి మంగళహారతి ఇచ్చితివా?"

"ప్రస్తుతమును మంగళహారతి ఇచ్చుచున్నారు. ఈ వ్యాసమును చూచి భావకవులు క్రోధముదాల్చక నన్ను మన్నించితిరేని వారియొక్క లోటులను ఇంకొకమారు మనవిచేసుకొందును."

"మంచిది. అటులయిన వారు నిన్ను మన్నించరు. పనివున్నది. అటులపోయి వచ్చెదను. వచ్చునంతలో భోజన ప్రయత్నమును చూడుము."

ధన్యులెవరు?

క. నిర్మలభావంబునఁ దమ
కర్మల విడనాడఁబోక కడుసంప్రీతిఁ
గర్మఫలము నాశింపక
ధర్మమెఱిఁగి మెలఁగువారె ధన్యులు ధరణిఁ.

శ్రీ లక్ష్మీసరస్వతులు.